కాలిపోతే .. కష్టం లేకుండా మార్పు

- ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు తొలగించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- హిందూపురం సబ్‌డివిజన్‌లో మూడేళ్లలో 401 ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు
- ఇబ్బందులు ఉంటే 1912 నంబర్‌కు ఫోన్ చేయొచ్చంటున్న విద్యుత్ అధికారులు


వ్యవసాయ పొలంలో అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

హిందూపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది. ఇందులో భాగంగానే వివిధ సంక్షేమ పథకాలతో అన్నదాతకు అండగా నిలిచింది. దీంతో పాటు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కీలకమైన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది.

టీడీపీ హయాంలో చందాలు వేసుకొని...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే వారం పది రోజులైనా మార్పు చేసేవారు కాదు. చివరకు రైతులు చందాలు వేసుకొని టాన్స్‌ఫార్మర్లను మరమ్మతు కేంద్రాల వద్దకు తీసుకెళ్లేవారు. అక్కడ కూడా వారి చేయి తడిపితేనే తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్‌నే రిపేరు చేసి ఇచ్చేవారు. మళ్లీ రైతులు దాన్ని సొంత ఖర్చుతోనే తీసుకువచ్చి బిగించుకోవాల్సిన దుస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ సబ్‌డివిజన్‌లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైన వెంటనే కేవలం 48 గంటల్లోనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పక్కాగా అమలు చేస్తూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినట్లు ధ్రువీకరణ జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెంటనే మరమ్మతు చేయడంతో పాటు 48 గంటల్లో మారుస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హిందూపురం విద్యుత్ సబ్‌డివిజన్‌లోని హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో మూడేళ్ల కాలంలో 401 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా నిర్ణీత సమయంలోనే వాటిని మార్చారు.

టోల్‌ఫ్రీ నంబర్ 1912 ఏర్పాటు

రైతులు, వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు చెప్పుకొనేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ టోల్ ఫ్రీ 1912ను తీసుకొచ్చింది. ఇది తిరుపతి ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. సేవల విషయంలో జాప్యం జరిగితే 1912 నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణం అధికారులు స్పందిస్తారు. దీంతో పాటు విద్యుత్ బ్రేక్‌డౌన్‌లు, ఫీడర్ ట్రిప్పింగ్స్, ఇతర విద్యుత్ అంతరాయ సమస్యలపై కూడా ఫిర్యాదు చేయొచ్చు. వెంటనే సంబంధిత జిల్లా అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరిస్తారు.

అంతా ఉచితంగానే...

ట్రాన్స్‌ఫార్మర్ కలిపోతే సంబంధిత రైతులు వెంటనే స్థానిక విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదైతే విద్యుత్ సిబ్బంది పాత ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి రోలింగ్‌లో ఉన్న దానిని అమరుస్తారు. పట్టణ సమీపంలో ఉంటే 24 గంటల్లోనే మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. రవాణ, మరమ్మతులకు ఎలాంటి రుసుం వసూలు చేయరు.

గుడిబండలో అధికం

మూడేళ్ల కాలంలో హిందూపురం విద్యుత్ సబ్‌డివిజన్‌లోని హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో కాలిపోయిన వాటి స్థానంలో 401 ట్రాన్స్‌ఫార్మర్లను మార్చారు. ఇందులో భాగంగా హిందూపురం రూరల్ 15, లేపాక్షి 40, పరిగి 22, చిలమత్తూరు 16, పెనుకొండ 8, సోమందేపల్లి 10, రొద్దం 29, మడకశిర 33, అమరాపురం 91, గుడిబండ 99, రొళ్ల 32, అగళి 6 ట్రాన్స్‌ఫార్మర్లు మార్చారు.

వెంటనే స్పందిస్తున్నారు



మాకు గతంలో 10–15 మోటార్లకు ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. కాలిపోతే మార్చేందుకు వారం రోజులైనా పట్టేది. ఒక్కోసారి చేసేది లేక మేమే ట్రాక్టర్లలో తీసుకెళ్లి మరమ్మతు చేయించి తీసుకొచ్చేవాళ్లం. ఇప్పుడు మాత్రం రెండు, మూడు మోటార్లకు ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా అధికారులు వెంటనే స్పందిస్తున్నారు. 48 గంటల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తుండటంతో పంటలు కాపాడుకుంటున్నాం.

– రామకృష్ణప్ప, కుర్లపల్లి, లేపాక్షి మండలం

48 గంటల్లోనే మారుస్తున్నాం



రైతుల సమస్యలు, అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సంబంధిత లైన్‌మెన్ ద్వారా ఫిర్యాదు చేస్తే సకాలంలో 48 గంటల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినట్లు నిర్ధారణ అయిన వెంటనే 1912కు నంబర్‌కు లేదా సంబంధిత సిబ్బందికి తెలిపిన వెంటనే రోలింగ్ కేంద్రాల నుంచి పంపే ఏర్పాట్లు చేస్తున్నాం..

– భూపతి, ట్రాన్స్‌కో ఈఈ, హిందూపురం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక


మంజునాథ్‌రెడ్డితో సమావేశమైన చరణ్‌రెడ్డి

సోమందేపల్లి: మండలంలోని పత్తికుంటపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్‌రెడ్డి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. నాలుగు రోజుల క్రితం ఆయన టీడీపీలో చేరారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్‌రెడ్డి సమక్షంలో మళ్లీ వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో కష్టపడ్డ వారికి కచ్చితంగా సముచిత స్థానం ఉంటుందని చరణ్‌రెడ్డి తెలిపారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హిందూపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లుగా తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ అభిషేక్ కుమార్ ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఏవైనా ఫిర్యాదులు, అభ్యర్థనలు ఉంటే కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్ 8125043157ను సంప్రదించాలని సూచించారు.

ఇస్లాపురంలో పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, జవాన్లు

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఇస్లాపురం, తిమ్మాపురం, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పోలీసులు, ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించారు. ప్రజలు ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలని ఎస్‌ఐ రాజేష్ అన్నారు. స్థానికంగా ఇబ్బందులు ఎదురైతే అధికారులను సంప్రదించాలని సూచించారు.

శుభకార్యం


వివాహ వేడుకలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్

పరిగి: మండల కేంద్రంలోని బీరప్పస్వామి ఆలయ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ జయరాం కుమారుడు నవీన్‌కుమార్, హారికల వివాహ రిసెప్షన్ మంగళవారం జరిగింది. ఇందులో భాగంగానే మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శాంతమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

పావగడ: స్థానిక తేజస్ చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత సీఈటీ (కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆ ట్రస్ట్ కార్యదర్శి, మాజీ జిల్లా పంచాయతీ సభ్యురాలు గాయత్రిబాయి ద్వితీయ పీయూ సైన్స్ విద్యార్థులకు సూచించారు. స్థానిక తేజస్ మీటింగ్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20న ఉదయం 11 గంటలకు హర్షిత కన్వెన్షన్ మీటింగ్ హాలులో నిర్వహించే ఉచిత సీఈటీ కోచింగ్ ప్రారంభోత్సవానికి తాలూకాలోని ద్వితీయ పీయూ సైన్స్ విద్యార్థులు, తల్లి తండ్రులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ జనార్దననాయుడు

అమరాపురం: సార్వత్రిక ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ జనార్దననాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి నిద్రగట్ట గ్రామంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో మెలగాలన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్‌ఐ.రామంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం


పెరటి మొక్కలను అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: 'ఉద్యాన పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు' అని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా మంగళవారం జీవీ పాళ్యం గ్రామంలో ఉద్యాన పంటల సాగు, పెరటి తోటల పెంపకంపై రైతులు, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణం, ఇంటి పరిసరాల్లో పెరటి తోటల సాగుకు ఆకుకూర విత్తనాలు, పెరటి మొక్కలను మహిళలకు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ పెరటి తోటల పెంపకం వల్ల మంచి ఆదాయం పొందవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉద్యాన పంటలను సాగు చేసి మంచి దిగుబడులు పొందాలన్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు ఆర్బీకే సిబ్బంది సూచనలు, సలహాలు అందిస్తున్నారని, వారి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకురాలు మౌనిక, పీడీ రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఈరలక్కప్ప


మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మడకశిర నియోజకవర్గ పరిశీలకులు పోకల అశోక్ కుమార్‌ను మంగళవారం తిరుపతిలో మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కలిశారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మడకశిర మండల కన్వీనర్ రామిరెడ్డి, అగళి కన్వీనర్ శ్రీనివాస్, గుడిబండ జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, మడకశిర పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు తదితరులు కూడా మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. మడకశిర నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నట్లు ఈరలక్కప్ప ఫోన్‌లో 'సాక్షి'కి తెలిపారు. ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మంత్రి సూచించారన్నారు. కలసికట్టుగా పని చేసి మడకశిరపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయాలని దిశానిర్దేశం చేశారన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పావగడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాలూకా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక స్వీప్ సమితి అధ్యక్షుడు ఈఓ జానకీరామ్ తెలిపారు. అలాగే నూటికి నూరు శాతం పోలింగ్ జరిగేలా చూస్తామన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో నూటికి 61 శాతం పోలింగ్ అయిందని అయితే ఈసారి నూటికి నూరు శాతం పోలింగ్ జరిగేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. శని మహాత్మ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్ కుమార్, బీఆర్సీ వెంకటేశులు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షకు 32 మంది గైర్హాజరు


పది పరీక్షకు హాజరైన విద్యార్థులు

లేపాక్షి: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం హిందీ పరీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 797 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 690 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప తెలిపారు. 32 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఏపీ గురుకుల పాఠశాల ఏ కేంద్రంలో 10 మంది, బీ కేంద్రంలో 07 మంది, ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో 07 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 08 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు.

రొళ్లలో 13 మంది...

రొళ్ల: మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షకు 13 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్ సెంటర్–1లో 201 మందికిగాను 193 మంది, ఆవినకుంట కేజీబీవీ సెంటర్–2లో 211 మందికి 206 మంది పరీక్ష రాశారన్నారు. సెంటర్–1లో చీఫ్ సూపరింటెండెంట్‌గా సునీత, సెంటర్–2లో చీఫ్ సూపరింటెండెంట్‌గా తిమ్మప్ప వ్యవహరించారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పోలీస్ సిబ్బందిచే గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

పరిగిలో 18 మంది...

పరిగి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. హిందీ పరీక్ష మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. మండల వ్యాప్తంగా 11 జెడ్పీ స్కూళ్లు ఏపీఆర్‌ఎస్, కేజీబీవీ, ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలతో పాటూ అమర్ విద్యామందిరం, ఏఎం లింగణ్ణ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 722 మంది విద్యార్థులకుగానూ 704 మంది పరీక్ష రాసినట్లు ఎంఈఓ–2 శేషాచలం తెలిపారు. 18 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు చెప్పారు.

రోడ్డుపైనే భారీ వాహనాలు


జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై భారీ వాహనాలను లారీ డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలీని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రహదారిపై వేల వాహనాలు వెళ్తుంటాయి. ముఖ్యంగా గుట్టూరు కనుమ నుంచి పెనుకొండ వై జంక్షన్ వరకూ రహదారి పక్కనే లారీలు, పలు భారీ వాహనాలను డ్రైవర్లు ఆపుతున్నారు. జాతీయ రహదారి కావడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి ఆగివున్న వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఇలాంటి ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా ఇతర ప్రాంతాలలో వాహనాలు ఆపకుండా పోలీసులు, అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అగ్నికి ఆహుతైన ఈతచెట్లు


అగ్నికి ఆహుతవుతున్న ఈత వనం

పుట్టపర్తి అర్బన్: ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లి సమీపంలో ఈతచెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం అగ్ని కీలలు దావానలంలా వ్యాపించడంతో సుమారు 80కి పైగా ఈత చెట్లు కాలిపోయాయి. వెంకటగారిపల్లి, కప్పలబండకు చెందిన పలువురు అక్కడ ఈత కల్లు, నీరా సేకరించి వ్యాపారం చేస్తుంటారు. ఈత వనం కాలిపోయి జీవనాధారం పోగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

జేసీఎస్ కన్వీనర్‌గా చిలకల రవి



రొద్దం: మంత్రి ఉషశ్రీచరణ్ ఆదేశాలతో మండల జేసీఎస్ కన్వీనర్‌గా కోగిర గ్రామానికి చెందిన బోయ చిలకల రవిని నియమించినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ .. తనపై మంత్రి ఉషశ్రీచరణ్ నమ్మకం ఉంచి జేసీఎస్ కన్వీనర్‌గా ఎంపిక చేశారని, నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం బుధవారం 10 గంటలకు ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్. దీపిక, పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మడకశిర పట్టణానికి చెందిన అంజికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... హిందూపురం నుంచి మడకశిరకు అంజి ఆటోను తీసుకొస్తున్నాడు. అయితే మడకశిర వైపు నుంచి హిందూపురానికి వెళ్తున్న కారు ప్రమాదవశాత్తూ కల్లుమర్రి సమీపంలో ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ అంజికి తీవ్రగాయాలయ్యాయి. ఆటో కూడా నుజ్జు నుజ్జైంది. అంజికి వెంటనే మడకశిర ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హిందూపురంకు తరలించారు.

పరీక్ష ఫీజు కట్టించుకోవాలి

హిందూపురం టౌన్: కళాశాల ఫీజులతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థులతో పరీక్ష ఫీజు కట్టించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వారు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్కే యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలకు 2, 4, 6వ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 20వ తేదీ వరకూ పరీక్ష ఫీజును కట్టించుకోవచ్చని ప్రకటించారన్నారు. అయితే కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు ఫీజులు చెల్లిస్తేనే పరీక్ష ఫీజును కట్టించుకుంటామని విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. అర్హత కలిగిన ప్రతి విద్యార్థితో పరీక్ష ఫీజు కట్టించుకోవాలన్నారు. పరీక్ష ఫీజును కట్టించుకోని కళాశాలల యాజమాన్యాలపైన ఎస్కే యూనివర్సిటీ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, బాబాఫక్రుద్దీన్, దేవరాజు, వేణు, రంగ, హరీష్, బాలాజీ, దర్శన్, పవన్, రంగప్ప, నరసింహ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి సన్మానం


డాక్టర్ శివశంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోరంట్ల: గోరంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శివశంకర్‌కు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి లభించింది. ఇందులో భాగంగానే ఆయన హిందూపురం ప్రభుత్వాస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం గోరంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న సహచర వైద్యులు, సిబ్బంది శివశంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్‌కుమార్, పావని, ఉషా, వేణుగోపాల్, హరిష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చింతరామచంద్రారెడ్డి, వైద్యాసిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపురమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కొల్లాపురమ్మ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయ ప్రధాన అర్చకుడు కొల్లాపురమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో హారతుల ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో కలశం


అలంకరణలో చోళమాంబదేవి


హారతులు తీసుకొస్తున్న వీరాపురం గ్రామస్తులు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం గ్రామంలోని కోట వీధిలో వెలసిన చోళమాంబదేవికి భక్తులు మంగళవారం ఘనంగా హారతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరాపురం, మద్దనకుంట, వీరాపురం, బంగారుపాళ్యం, పుల్లీకుంట గ్రామస్తుల నుంచి మహిళా భక్తులు తమ ఇళ్లలో పిండితో తయారు చేసిన కలశాన్ని ఏర్పాటు చేసుకుని గ్రామ వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న దిన్నెగుడి వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత స్థానిక ఆలయంలో అమ్మవారికి అర్చకుడు శ్రీనివాస్ వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి భక్తులు తెచ్చిన పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శివకుమార్‌గౌడ, యంజేరప్ప, తిప్పేస్వామి, సిద్దలింగప్ప, మంజునాథ, శానుబోగరు తదితరులు పాల్గొన్నారు.